

# మేష్టారి దీవెన

వేదుల చిన్నవెంకట చయనులు

మా స్కూలులో చాలామంది మంచి మేష్టార్లు ఉండేవారు. కొందరు కొట్టక, తిట్టక పాఠాలు చెప్పేవారు. కొందరు తిట్టినా, కొట్టినా బాగా పాఠాలు చెప్పేవారు. మరికొందరు బాగా పాఠాలు చెప్పకపోయినా కొట్టి తిట్టేవారు కాదు. భోగయ్యగారిలాంటి మేష్టార్లు పాఠాలు బాగా చెప్పలేదు. కొట్టి తిట్టేవారు కూడా. అయినా సహృదయులు కనుక అలాంటివారు మంచి మేష్టార్లలోనే లెక్కలోకి వచ్చేవారు.

నా ఒక్కడికి మాత్రం భోగయ్యగారి శాపనార్థమే మిగిలి భరించలేని స్మరణగా ఉండిపోయిందా అని మొన్న మొన్నటిదాకా అనిపిస్తూ ఉండేది. మేష్టారి శాపానికి గడచిన ఆ ముందు పది రోజులూ కళ్లకు కట్టినట్లుగానే మెదులుతున్నాయి.

"ఒరేయ్, నువ్వు రేపటి నుంచి బడికి వెళ్లేముందు ఓ గంట మా ఇంటికి వస్తే మంచిది!" భోగయ్య మేష్టారు చెప్పాక "ఎలా మంచిది? నాకా? మీకా?" అన్న ప్రశ్నలు మెదడులో తిరిగినా, అవి అలాగే ఉంచేసుకుని, "అలాగే మేష్టారూ!" అని అతను మరేదైనా పని చెప్పే ముందే తుర్రుమని పరుగు తీశాను. అసలు మేష్టారలా ఎందుకు పిలిచారో తెలుసును. ఒకవిధంగా అందుకు - మేష్టారి దృష్టిలో మంచి కుర్రాడిగా వచ్చినందుకు సంతోషించాల్సిందే. మరోవిధంగా నాకది ఎంతమాత్రమూ ఇష్టం లేని పని.

క్లాసులో వెనుకబడిన పిల్లలని చూసి భోగయ్యగారు వాళ్లని తన ఇంటికి స్కూలుకి వెళ్లేముందు ఓ గంట ప్రైవేటుకు రమ్మని పిలిచేవారు. స్థితిపరులైతే మేష్టారుకి అలా ప్రైవేట్లు చెప్పినందుకు నెలకింతో అంతో ముట్టచెప్పేవారు. బీదవాళ్ల కది ఉచితమే! అసలు మేష్టారు ప్రైవేటు కింత ఇయ్యండి అని సొమ్ములున్నవారిని కూడా ఎన్నడూ అడగలేదు. అయ్యో, కుర్రవాడు వెనకబడిపోతున్నాడు, కొంచెం మద్దతు చేస్తే బాగుపడతాడేమో నసే ఆయన ఆరాటం.

మేష్టారికి ఉద్దేశం ఉంటే ఉన్నది కానీ, ఇంట్లో పరిస్థితి మాత్రం దానికి అనుకూలంగా ఉండేది కాదు. పెళ్లాం పోయింది. ఇద్దరు పిల్లలు పెరిగి పెద్దవాళ్లయి వాళ్ల మానాన్న వాళ్లు బతుకుతున్నారు. ఇంకా ఓ చిన్నది మిగిలిపోయింది. చిన్నా అనేగానీ ఆ పిల్ల పేరు తెలియదు. నే మేష్టారి క్లాసులో చదువుతున్నప్పటికి చిన్నాకి పదేళ్లుంటాయి. అల్లారు ముద్దు మామ్మ. దాని హోమ్‌వర్కు, ముస్తాబు, చల్ది అన్నం చూసుకుని బడికి తయారుచేసేటప్పటికి మేష్టారి తల ప్రాణం తోకకి దిగి వచ్చేది. దాని సంరక్షణే చూసుకుంటారా, లేక దాదాపు ఇరవైమంది పిల్లల ప్రైవేటే చూసుకుంటారా? అందుకని ప్రైవేటు చెప్పడానికి క్లాసులో మంచి రేంకులలో ఉన్న పిల్లలని ఇంటికి పిలిచి, ఆ అబ్బాయిలకి.. వాళ్ల క్లాస్‌మేట్లకి ప్రైవేటు చెప్పే పని అంటగట్టేవారు.

"నీకు నువ్వే తెలివైన వాడివని గర్వంలా ఉంది. ఏదో ఐయ్యేయెస్ చేసేసి వెలగబెడతా ననుకుంటున్నావేమో! నీ బుర్ర తిరుగుడికి కలెక్టరు కాదురా, కలెక్టరాఫీసులో గుమాస్తానే సరిపోతుందిరా! ఫో! ఫో! మా ఇంటి గడప తొక్కావంటే చూడు!"



మాకు స్కూలు పదింటికి ఆరంభించేవారు. త్వరగానే చల్ది అన్నం తినేసి స్కూలు ఆటస్థలంలో ఓ గంటా గంటన్నర ఆడుకున్న తరువాత బడి మొదలయ్యేది. మేష్టారు ప్రైవేటు చెప్పమని పిలిచేరంటే, మరి ఉదయం ఆటలు బందనే కదా! అందుకనే మేష్టారు పిలిచేరంటే బాధగా ఉంది. తీరా వెళ్లాక, ఆటలు కట్టేసెయ్యన్నది ఓ పెద్ద బాధ అనిపించలేదు కానీ, చిన్నా పెట్టే చిచ్చు అంతా ఇంతా కాకుండా భరించలేనంతగా కనపడింది.


మేష్టారు స్వయంపాకం చేసుకుని భోజనం చేసి స్కూలుకి వచ్చేవారు. అందుకని మేష్టారికి చిన్నా హోమ్‌వర్కు చూసుకునేందుకు టైముండేది కాదు. ఆ కిందటి సాయంత్రమే హోమ్‌వర్కు కానిచ్చుకుంటుందా అంటే, ముద్దు మామ్మ కదా! సాయంత్రం ఆటలాడుకుంటూ హోమ్‌వర్కు ముట్టేది కాదు. ప్రైవేటు కుర్రాళ్లతో బాటు చిన్నా హోమ్‌వర్కు కూడా, నాలాంటివాళ్ల నెత్తిన పడేది. మేం నలుగురం ఉండేవాళ్లం కానీ ఎందుకనో చిన్నా నేనే చెప్పాలి అని పట్టుపట్టేది.

చిన్నా నాలుగో క్లాసు చదువుతుండేది కానీ రెండు వరుసల అంకెల కూడిక కూడా వచ్చేది కాదు. ఎక్కాలు మొదటికే సున్నా. హోమ్‌వర్కు చూస్తే పెద్ద పెద్ద భాగాహారాలు, చిన్నచిన్న లాభం, నష్టం, లెక్కలూ ఉండేవి. నన్ను చేసేసి తన పని కానిచ్చేమనేది. నేనలా చేయనంటే ఏడుస్తూ నాన్న దగ్గరికి వెళ్లి నామీద ఫిర్యాదు చేసేది. లోపల వంటతో కుస్తీ పడుతున్న మేష్టారికి ఏం చెప్పేదో ఏమో, ఆయన ఆ మాత్రం ఓపికపట్టి చెప్పలేవా అని నన్ను కేకలు వేసి, లోపలకు వెళ్లిపోయేవారు. నే ఇంట్లోకి వెళ్లకూడదు. అందుకని నా గోల ఆయన చిన్నా కంటే ముందు ఎప్పుడూ వినలేదు. విన్నా, ముద్దుమామ్మ మాటే నెగ్గి, నాకు అతని ట్రేడ్‌మార్కు దెబ్బ పడిఉండును.

ట్రేడ్‌మార్కు దెబ్బ అంటే, మేష్టారు, బోజనం చేసి స్కూలుకు వచ్చేటప్పుడు ఇంటికి ఒక పెద్ద ఇనుప తాళం వేసి వచ్చేవారు. మతిమరుపు దోషం కూడా రవంత ఉంది కనుక ఆ తాళం పంచెలోపల బొడ్డు దగ్గరగా దోపుకుని తిరిగేవారు. దాంతో నెత్తిమీద ఒక్కటేస్తే సోలెడు తలనూనె ఇంకిపోయేది!

మేష్టారు కోప్పడినా, తాళంతో ఒక్కటిచ్చుకున్నా సంతోషంతో, చప్పట్లు కొడుతూ, చిన్నా పళ్లికిలించేది. ఇంత అవుతుందని తెలిసి కూడా నా పట్టు నాది, చిన్నా పట్టు చిన్నది. ఒకరోజు నాకు దానికి చెప్పలేక, కోపం వచ్చి, "నీ మొద్దు బుర్రకి నేనెంత మొత్తుకున్నా లెక్కలు ఎక్కవు!" అని పెన్నుతో గట్టిగా దాని తలమీద పొడిచాను. ఎంత దెబ్బ తగిలిందో చెప్పలేను గానీ అదే సమయానికి మేష్టారు బయటికి ఎందుకో వచ్చి చూసేశారు. అంతే, ఆయన మండిపడుతూ, "గెటౌట్! యూ ఫూల్! టార్చెరర్, ఇంపేషంట్ రాస్కెల్! హౌ డేర్ యు టచ్ మై లిటిల్ గర్ల్!" (ఆయన మాకు ఇంగ్లీషు చెప్పేవారు. ఏదైనా గొప్పగా వర్ణించాలన్నా, కోపంగా తిట్టిపోయాలన్నా ఇంగ్లీషు మధ్యమధ్యలో వాడేవారు) అని ఇంగ్లీషు పదాలతో తిట్టి, ఆగలేదు "నీకు నువ్వే తెలివైన వాడివని గర్వంలా ఉంది. ఏదో ఐయ్యేయెస్ చేసేసి వెలగబెడతా ననుకుంటున్నావేమో! నీ బుర్ర తిరుగుడికి కలెక్టరు కాదురా, కలెక్టరాఫీసులో గుమాస్తానే సరిపోతుందిరా! ఫో! ఫో! మా ఇంటి గడప తొక్కావంటే చూడు!" అని తాగినవాడిలా కళ్లెర్ర చేసుకుని నన్ను వాళ్లింటినుంచి తరిమేశారు.

మంచి పనే అయింది, శని విరగడయింది అనుకున్నా. రక్షించి మేష్టారు అది మనసులో ఉంచుకుని నన్నెన్నడూ బాధపెట్టలేదు.



మార్కులలో తక్కువ చేయనూలేదు. అంతా కలిపి, ఆయన ఇంటికి ప్రైవేటు చెప్పడానికి ఓ పది రోజులే వెళ్లి ఉంటాను కానీ ఆయన శాపనార్థం, దానికి కారణభూతి అయిన ఆ పెంకి చిన్న అంటే రోత, మొన్నటివరకూ వెంటాడుతూనే ఉంది.

మా నాన్న నన్నేవేవో పై చదువులు చదివించి, పెద్దవాడిని చేసేద్దామని కలలు కనేవాడు. తనేమో ఊళ్లో పెద్ద లాయరు. మామూలు లాయర్లు కేసుకి పాతిక రూపాయలే మహా గొప్ప అనుకుంటే, నాన్నగారికి కేసుకు వెయ్యి వచ్చేదని ప్రతీతి. కారు, డ్రైవరు, మాకు బడికి వెళ్లేందుకు వేరే గుర్రంబండి, అమ్మ ఒంటినిండా ఆభరణాలు, ఇంట్లో వంటవాడు, ఓ డజను పనివాళ్లు. ఆ హోదా, ఈ రోజుల్లో కలెక్టరు కూడా అనుభవించటం లేదనుకుంటా.

మా శ్రీరాంపురంలో హైస్కూలు తరువాత లేదు కనుక నే కాలేజీ చదువుకి విశాఖపట్టణం వెళ్లాల్సి వచ్చింది. బి.ఏ. ఫైనల్ పరీక్ష ఇంకో వారం రోజులలో ఉందనగా నాన్న హఠాత్తుగా గుండెపోటు వచ్చి చనిపోయారు. అంత హోదా హుష్ కాకీ అయిపోయింది. ఆస్తికి రెండింతలు ఖర్చుతో ఊరునిండా నాన్నగారి అప్పులవాళ్లే. మాకు వేయి, మాకు పదివేలంటూ, కాగితాలు చూపెట్టేవారు. కారు, బండీలే కాకుండా అమ్మ నగలు కూడా అమ్మేసి చివరికి ఒక్క ఇల్లు మాత్రమే దక్కించుకుని అప్పులు తీర్చేయగలిగాము. నా తరువాత వరుసగా ఇద్దరు చెల్లెళ్లు, ఇద్దరు తమ్ముళ్లు, ఉన్న పెద్ద సంసారానికి నేనే దిక్కయ్యాను. బి.ఏ. తరువాత ఐఏఎస్‌కి తర్ఫీదయి మంచి రేంక్‌తో పాసై ఐఏఎస్ ఆఫీసరునవుదామని అనుకుంటూ ఉండేవాడిని. దానికి బదులు కలెక్టర్ ఆఫీసులో గుమాస్తాగా చేరిపోయి నాలుగు రాళ్లు సంపాదించ మొదలుపెట్టేను. పని చేస్తూనే పరీక్షలకి వెళ్లవచ్చు ననుకుంటే, కలెక్టర్ ఆఫీసు నౌఖరీ కిరాణా కొట్టు గుమాస్తా కన్నా కనాకష్టమనిపించేలా, రోజూ పొద్దున్న తొమ్మిదిన్నరకి, పెద్దవాళ్లు రాకముందే హాజరై, అందరూ వెళ్లాక, సాయంత్రం ఏ ఏడింటికో, చచ్చి శవం అయి ఇల్లు చేరుకుంటే, మరి చదువుకి వీలెక్కడ? అయినా అలాగే వెళ్లాను, రెండుసార్లు. ఇంటర్వ్యూకైనా పిలుపు రాలేదు. రెండుసార్లూ, కలెక్టరు కాకుండా, భోగయ్య మేష్టారి దీవెన ధర్మమా అని, కలెక్టరు ఆఫీసు గుమాస్తానే రాసిపెట్టి ఉంది అని తేలింది.

అమ్మ పెళ్లి చేసుకోమని పోరు పెట్టేది. చెల్లెళ్ల పెళ్లిళ్లకి కాస్తో కూస్తో వెనక వేయాలా? అవ్వా కావాలి బువ్వా కావాలి అంటే కుదరదని ఆ మాట వద్దనేశాను. ఆ తరువాత తమ్ముళ్ల చదువులు మిగిలాయి. ఇలా ఇరవై ఏళ్లు గడిచిపోయాయి. సుమారు నలభై రానేవచ్చాయి. ఇప్పుడు నన్ను చేసుకునే వారెవరు అని పెళ్లి తలపులు అలా వెనుకనే ఉంచేసుకుని అమ్మా, నేనూ జీవితం నెట్టుకు వస్తున్నాం. ఎదుగూ బొదుగూ లేని కుక్కగొడుగు ఉద్యోగం. ఇన్నాళ్లు చెమటోడిస్తే, ఒక్క మెట్టు ఎదిగి అప్పర్ డివిజన్ క్లర్క్ అయ్యాను.


పెద్ద చెల్లికి మంచి సంబంధమే చేశాం. ఇంజనీరు. మన ప్రాంతాలలో కొన్నాళ్లు పనిచేసి కొత్తగా పెట్టిన భిలాయ్ స్టీల్ ప్లాంట్‌లో చేరి ఇంచుమించు అక్కడి వాడే అయిపోయాడు. మొదట్లో పండగా, కథా కార్యాలకి తరచుగా మా ఇంటికి వస్తూ ఉండేవారు కానీ పిల్లలు పెద్దవాళ్లయిన దగ్గరనుంచీ వాళ్ల చదువులంటూ రాకపోకలు బాగా తగ్గిపోయాయి. రెండో చెల్లికి మా ఊరు సంబంధమే చేశాము. బావ నాలాగే గుమాస్తా. మా ఊరి తాసీల్దారు గారి ఆఫీసులో. పోతే ఒక్క తేడా. అది మీరు అతని చాకచక్యమనండి, లేదా నా పనికిమాలిన తనమనండీ. ఏమన్నా సరే, మా బావ ఆ చిన్న ఉగ్యోగంలోనే ఆస్తి, పరపతీ సంపాదించాడు. నా బతుకు అతుకుబొతుకుల బొంతలాగే ఉంది. దగ్గరలోనే ఉందేమో, మా చెల్లెకి నేనంటే ఎంతో ప్రేమ. అందుకనే ఎప్పుడూ నాకో సంబంధం చూసి పెడదామనే చూస్తూ ఉంటుంది. విధివశాత్తు ఇంత వరకూ ఏదీ పొసగలేదు. వాళ్ల గోత్రం కుదరదనో, వావి అనో, వాళ్లింట్లో అప్పుడెప్పుడో అప్రతిష్ట అయిందనో, వాళ్లు మా ఇంట్లో ముష్టికి వచ్చేవారనో, అలా అలా ... చూపుల దాకా రాకుండానే అమ్మ కొట్టేస్తూ ఉండేది. ఒకటి రెండు ఆ గండాలు అన్నీ దాటాయంటే, ఆవిడకి నే నచ్చలేదనో, నాకు ఆవిడ నచ్చలేదనో పాకానికి రాలేదు.

నేను ఆఫీసు నుంచి సాయంత్రం వచ్చేటప్పటికి చెల్లీ, అమ్మా, వాదులాడుకుంటున్నారు. "అమ్మా! నీ పాతకాలం పట్టింపులు, పనికిరాని నమ్మకాలే అన్నకి పెళ్లి కానివ్వకుండా ఉంచేస్తున్నాయి!" అని చెల్లీ, "ఎంత కిందకి దిగజారినా, అవ్వ! ఇలాంటి సంబంధం తెస్తే ఎలాగే? నవ్విపోతారు!" అని అమ్మా వాదులాడుకుంటున్నారు.

"చూడరా, రామం!" అని అమ్మా, "చూడన్నా!" అని చెల్లీ, నా బుగ్గలు తిప్పచూశారు. మీ ఇద్దరి మాటా సావకాశంగా వింటా గానీ, ముందు ఈ గొంతుకలో కాసిన్ని కాఫీ చుక్కలు పడనీయుండి అని తాత్కాలిక సంధి చేశాను.

వాళ్ల వాదాల సారాంశం క్లుప్తంగా ఇది. ఓ పదేళ్ల అమ్మాయి ఉన్న వితంతువుని నేనెందుకు చేసుకోరాదూ, అని చెల్లి వాదం. ఎంత చెడ్డా, వితంతువు. అందులోనూ ఎదిగిన ఓ అమ్మాయితో ఉన్న ఆవిడని చేసుకునే ఖర్మ ఏం పట్టిందీ, అని అమ్మ వాదం.

"ఆదర్శవాది అంటూ ఏమో చెప్తావే, ఆ ఆదర్శాలు ఆచరణలోకి పెట్టాలంటే ఇదే మంచి



అవకాశం!" అంది చెల్లి ఆఖరి మాటగా. చెల్లిమాట నచ్చింది నాకు. అమ్మని ఎలాగైనా ఒప్పించాలని, "నాకే ఓ పదేళ్ల అమ్మాయి ఉండి నా భార్య చనిపోతే, మళ్లీ పెళ్లి చేసుకోమంటావా, లేదా అమ్మా!" అని అడిగాను. "నీకేంరా, నలభై కూడా రాలేదు. పిల్లకి ఓ ఆడదిక్కు కూడా ఉండాలి కదా ఇంట్లో?" అంది అమ్మ. "మరి అదే ఆడదైతే, దాని పిల్లకి నాన్న అవసరం లేదా అమ్మా?" అని చెల్లి అడిగింది. "రెండూ ఒకటెలా అవుతాయి?" అని తనదే ఆఖరిమాట అన్నట్లు అమ్మ అక్కడనుంచి లేచి వెళ్లిపోయింది.,

అమ్మని అంత సులువుగా ఒప్పించలేమని తెలుసు. నేనేది నిశ్చయించినా దానికి మనసు మళ్లించుకుని నన్నాశీర్వదిస్తుందని కూడా తెలుసును. అందుకని చెల్లితో, "ఎవరే ఆ ఆవిడ?" అని అడిగాను.

"నీకు మా మరదలు శారద గుర్తు ఉందా?"

"ఎంతమందో మరదళ్లు నీకు. అందులో ఈ శారద ఎవరో కొంచెం వివరిస్తే గానీ ..."

"ఆవిడే అన్నా! నీకు ఆవిడని మా ఆయన చెప్పవస్తే, అమ్మ కుండమార్పని కొట్టేసిందీ!"

"ఆవిడే నువ్విందాక అంటూన్న విధవా?"

"శివ శివ! నిక్షేపంగా ఉన్నాడు వాళ్లాయన!"

"మరైతే?"


"నువ్వింకేవో అర్థాలు వలికేముందు శాంతంగా నా మాట విను. మా శారద వాళ్ల ఆయనతోటే ఆంధ్రా యూనివర్సిటీ మేథమేటిక్స్ డిపార్ట్‌మెంట్‌లో లెక్చరర్‌గా పనిచేస్తోంది... జానకి. అది నాకు గర్ల్స్ స్కూల్‌లో నాలుగో క్లాసు నుంచి ఎనిమిదో క్లాసు దాకా క్లాస్‌మేట్. పెంకి ఘటం అనేవారం!"

"ఆ పెంకి ఘటాన్ని నాకు అంటగడదామనుకుంటున్నావా?"

"అలా మాటిమాటికీ మధ్యలో అడ్డు వస్తుంటే, తెల్లారిపోతుంది, నా మాట అయ్యేసరికి. నువ్వు వింటూ ఊరుకుంటావా, లేదా?" అని చాలా సీరియస్‌గా చెల్లి అంటూంటే, వచ్చే నవ్వు ఆపుకుంటూ,

"సారీ! ఇక మీద నీ మాట పూర్తి అయ్యేవరకూ అడ్డు వస్తే ఒట్టు!" అన్నాను.

"మన ఊళ్లో ఆడపిల్లల హైస్కూలు లేదని జానకి వాళ్ల అన్నయ్య దగ్గరికి వెళ్లిపోయింది. అమ్మ చిన్నప్పుడే పోయిందని జానకి నాన్నగారు తన ఆఖరి బాధ్యత తీర్చేసుకుందామన్న




ఆతురతతో జానకికి ఇంటరులోనే పెళ్లి చేసేశారు. వెంటనే కాపురానికి వెళ్లిపోయింది. వాళ్లాయన ఎయిర్ ఫోర్సులో పైలెట్‌ట. జానకి కడుపుతో ఉండగానే విమాన ప్రమాదంలో చనిపోయాడు. ఆ తరువాత వాళ్ల నాన్నగారు ఎమ్మేదాకా చదివించాక యూనివర్సిటీలో లెక్చరర్‌గా చేరింది!" అని పూర్తి చేసి ఏమంటావ్ అన్నట్లు నావైపు చూసింది.

"అలాగే. ముందు ఆవిడకి నువ్వు స్వయంగా వెళ్లి మన సంగతులన్నీ చెప్పి చూడు. నీకు నచ్చితే నాకు నచ్చినట్లే. అమ్మకి నే తర్వాత చెప్తా గానీ, ఆవిడకోసం, మీ మరద లింట్లో కలవవచ్చు!" అనగానే చెల్లెలు ఎగిరి గంతేసి, "నాకు తెలుసు నువ్వేంతో విశాల హృదయుడవని" అని పొంగిపోతూ లేచింది. ఇందులో నన్నంత పొగిడేయవలసిన అవసరం కనపడలేదు నాకు. అది స్వార్థమే అనాలి. లేకపోతే ఈ నడివయస్కుడిని పెళ్లాడడానికి ఏ కన్య తయారుగా ఉంటుంది అని అనుకుంటూనే వీధిలోకి బయలుదేరాను.

కల్యాణం వచ్చినా కక్కు వచ్చినా ఆగదంటారే, అలాగే అయింది. చూపులూ, సమ్మతాలూ అన్నీ మరో పది రోజులలో.

రాత్రి పెళ్లి. ఆ కల్యాణమండపంలో మా తమ్ముళ్లు, చెల్లెళ్లూ, వాళ్ల సంసారాలే నిండుగా ఉన్నారు. రెండో పెళ్లనో ఏమో, ఆవిడ తరఫున ఆవిడ డిపార్ట్‌మెంట్‌వాళ్లు ఓ అరడజనుమంది తప్ప ఎవరూ లేరు. ఏమలా అని ఆవిడని అడిగాను, ఆ వేదికమీదే. అన్నయ్యకి తన పెళ్లి ఇష్టమే లేదట! అక్కయ్య దూరంగా ఎక్కడో ఉంటూ రాలేమని ఉత్తరం వేసి ఊరుకుంది అని చెప్తూ కంట తడిపెట్టింది. అశుభం, అలా కన్నీరు వద్దని ఓదార్చ చూశాను. అప్పుడు నా కళ్లల్లోకి సూటిగా చూస్తూ, "థాంక్స్!" అని ఆమె అన్నప్పుడు నా మనసు కరిగిపోయిందనుకోండి!

పెళ్లి తంతు అవుతూండగా ఆయనని చెరో రెక్కా పట్టుకుని ఇద్దరు తీసుకువచ్చి, మొదట వరుస కుర్చీలలో మాకు సూటిగా ఎదుట కూర్చోపెట్టారు. ఆయనని చూడగానే సందేహం లేదు; ఆ ట్రేడ్‌మార్కు బొద్దు మీసాలతో ... భోగయ్య మేష్టారే! ఆయనకెలా తెలిసి, అంత వయసులో కూడా, అభిమానంగా వచ్చేరు చెప్మా, అని ఆశ్చర్యమైంది.

ముందు, వేదికమీద ఒకపక్కన కూర్చున్న మా అమ్మకి మేం నమస్కారం చేసి, అమ్మ దీవెనలు అందుకున్నాక, బ్రహ్మగారు నేరుగా మేష్టారి దగ్గరకు తీసుకునివెళ్లారు. ఆయనకి సరిగా కనులు ఆనటంలేదు. అయినా "చిరంజీవ, శుభమస్తు!" అని అక్షింతలు వేశాక, "రాంభట్లా! మా చిన్నాని జాగ్రత్తగా చూసుకో బాబూ!" అని నన్ను కౌగలించుకున్నారు. అలా ఇంటిపేరుతో మా స్కూలు మేష్టార్లే పిలిచేవారు.

సుమారు పాతికేళ్ల తరువాత అలాంటి వాత్సల్యపూర్వక పిలుపు విన్నా. పక్కనే మా చెల్లి ఉండి నవ్వుతోంది. అది పెళ్లి అంతసేపూ మేష్టారితో కిచకిచలాడుతూ ఏమేమో కబుర్లు చెప్పింది. అందుకనే మా కుటుంబం విషయాలు కొంచెం విపులంగా మేష్టారికి తెలిసి ఉండాలి. జానకిలో మాత్రం, నన్ను చిన్ననాటి కోపిష్టిగా గుర్తుపట్టిన సూచనే లేదు; తండ్రి మీద ప్రేమే, ఆ కన్నీటి ధారలో కనపడింది. ■